మృతుడి కుటుంబీకులకు బీమా చెక్కు అందజేత



బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మృతుడి భార్య రజితకు బీమా చెక్కు శుక్రవారం అందజేశారు. బీఆర్‌ఎస్ కార్యకర్త పట్టణానికి చెందిన ద్యాగల రమేష్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మరణించాడు. పార్టీ సభ్యత్వం ఉండడంతో అతడికి రూ. 2 లక్షల బీమా మంజూరు అయ్యింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా బీఆర్‌ఎస్ పార్టీ ఆదుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌ఎన్‌ఆర్‌లో ఓరియంటేషన్ ప్రోగ్రామ్



విద్యార్థినికి బహుమతి ప్రధానం చేస్తున్న డైరెక్టర్ సీవీ కృష్ణారెడ్డి, డీన్‌లు

పోచారం: చౌదరిగూడ నల్లా నర్సింహ్మారెడ్డి ఇంజనీరింగ్ (ఎన్ఎన్ఆర్) కళాశాలలో శుక్రవారం ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ సీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎంబీఏ విద్యార్థులకు తరగతి విద్యతో పాటు ట్రెనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తామన్నారు. అనంతరం అకాడమిక్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల వైస్ చైర్మన్ నల్లా ప్రశాంత్‌రెడ్డి ప్రశంస పత్రంతో పాటు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఎంబీఏ డీన్ రవీందర్‌రెడ్డి, ఇంజనీరింగ్, ఫార్మసీ డీన్‌లు జనార్ధన్ రెడ్డి, కృష్ణమోహన్, ట్రెనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్ హెచ్‌ఓడీలు, డీన్‌లు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కళా ఉత్సవ్ పోటీలకు తూంకుంట విద్యార్థుల ఎంపిక



విజేతలుగా నిచిలిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శామీర్‌పేట్: రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు తూంకుంట విద్యార్థులు ఎంపిక అభినందనీయమని శామీర్‌పేట మండల విద్యాధికారి వసంతకుమారి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీల్లో గ్రూప్ డాన్స్ విభాగంలో తూంకుంట మున్సిపాలిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం సాధించారన్నారు. అనంతరం గ్రూప్ డ్యాన్స్‌లో పాల్గొన్న విద్యార్థులు సాయిహర్షిత, సంధ్య, పార్వతి, అనుష్క, శిరీషలను ఎంఈఓతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి

కీసర: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇంజనీరింగ్ విద్యార్థికి గాయాలైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. మౌలాలికి చెందిన అనూస్(17) భోగారం హోలీ మేరి ఇంజనీరింగ్ కళాశాల్లో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం తన ద్విచక్రవాహనంపై మిత్రుడితో కలిసి వేగంగా కీసర మీదుగా భోగారం వెళ్తుండగా అన్నపూర్ణ ఫంక్షన్‌హాల్ వద్ద అదుపుతప్పి ఓ స్కూటీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో స్కూటీపై ఉన్న మహిళకు స్వల్పగాయాలు కాగా, స్కూటీపై ఉన్న చిన్నారులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఘటనలో అనూస్‌కు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బోడుప్పల్: 15వ డివిజన్ పరిధిలో జరుగుతున్న బీటీ రోడ్డు పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ కొత్త దుర్గమ్మగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మల్లాపూర్ పారిశ్రామికవాడ నుంచి సూరజ్‌నగర్ కాలనీ వరకు పనులు చురుకుగా కొనసాగుతున్నాయన్నారు. ఈ రోడ్డు పనులు పూర్తైతే చెంగిచర్ల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ బీ – బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, సూరజ్‌నగర్ కాలనీ అధ్యక్షులు రచ్చ శ్రీనివాస్, కాలనీవాసులు సిద్దులు, అక్బర్, పద్మారెడ్డి, బాలరాజ్, రమణారెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.59 లక్షలతో బేబీ పాండ్ రిటైనింగ్ పనులు

మల్కాజిగిరి: సఫిల్‌గూడ మినీట్యాంక్ బండ్ వద్ద బేబీ పాండ్‌లో రూ. 59 లక్షలతో చేపట్టిన రిటైనింగ్ పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. రిటైనింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించామన్నారు. పాండ్ విస్తరణతో పాటు లేక్ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను కోరామన్నారు. డీఈ మహేష్, ఏఈ నవీన్, వీఐ రమేష్, నాగయ్య, వేణుయాదవ్, రవి పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ మార్కెట్‌లోని పాత గ్రామపంచాయితీ భవనాన్ని శుక్రవారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్, అల్వాల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ భవనం కూలిపోయే స్థితిలో ఉందని, ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని, పలు ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగపడేలా నూతన భవనాన్ని నిర్మించాలని కోరారు. స్థానిక కాంగ్రెస్ నేతలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

‘పది’లో ‘వంద’ లక్ష్యం

- ఎస్సెస్సీ విద్యార్థులకు ‘ప్రత్యేక’ తరగతులు
- 108 ప్రభుత్వ పాఠశాలల్లో 8 వేల మంది..
- ప్రభుత్వ బడులపై జిల్లా విద్యాశాఖ స్పెషల్ ఫోకస్



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ బడులపై మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ స్పెషల్ ఫోకస్ పెడుతోంది. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలతో పోటీ పడే విధంగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి పథంలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే అక్టోబర్ నుంచి 108 ప్రభుత్వ బడుల్లో చదువుతున్న 8 వేల మంది విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో సాయంత్రం వేళల్లో జిల్లా విద్యాశాఖ ప్రత్యేక తరగతులు కొనసాగేలా చర్యలు తీసుకుంటోంది. ఈ ప్రత్యేక తరగతుల నిర్వాహణ కార్యక్రమాన్ని 3 ఏళ్లుగా నిర్వహించటం ద్వారా జిల్లా విద్యాశాఖ మంచి గుర్తింపును సాధించింది. అలాగే, గత బీఆర్‌ఎస్ హయాంలో ప్రభుత్వ బడుల్లో మన బడి–మన ఊరు–మన బస్తీ పథకం కింద 176 పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణంతోపాటు మౌలిక సదుపాయాలను కల్పించగా, అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద కాంగ్రెస్ ప్రభుత్వం సంబంధిత అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా 286 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.12.01 కోట్లతో 699 మరమ్మతులు తదితర అభివృద్ధి పనులను చేపట్టింది. అలాగే, ప్రపంచాన్ని కుదిపేసిన కొవిడ్ మహమ్మారి విద్యాసంస్థలపై పెను ప్రభావాన్ని చూపగా, ఆ క్లిష్ట పరిస్థితుల నుంచి విద్యార్థులను గట్టెక్కించటానికి విద్యాశాఖ ‘మేడ్చల్ బడి’ యాప్ ద్వారా ఆన్‌లైన్ తరగతులను నిర్వహించి తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి మన్ననలను అందుకుంది. పుస్తక పఠనం పేరుతో రీడింగ్ క్యాంపెయిన్ నిర్వహించింది. బాలికా సాధికారత కోసం పాఠశాలల్లో కమిటీ(క్లబ్)లు, టూరిజం ప్రాధాన్యతను విద్యార్థులు తెలుసుకునేలా సర్కారు బడుల్లో పర్యాటక క్లబ్బులు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో అనేక కార్యక్రమాలకు జిల్లా విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల విద్య కొనసాగుతుండటంతోపాటు ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు, డ్రెస్సుల సరఫరా వంటి కార్యక్రమాల నేపథ్యంలో విద్యాశాఖ చేపట్టిన బడి బాట కార్యక్రమానికి భారీగా స్పందన లభిస్తోంది. కరోనా మహమ్మారి నేర్పిన గుణపాఠంతో మూడేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో 3 వేల నుంచి 4 వేల విద్యార్థులు చేరటం, ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చి మరీ ప్రభుత్వ బడుల్లో చేరారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఏ జిల్లాలో లేని విధంగా 515 ప్రభుత్వ పాఠశాలల్లో 1.07 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ–2024లో ఖాళీగా ఉపాధ్యాయ పోస్టులు కూడా భర్తీ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే విద్యాశాఖ మరింత పట్టుదలతో విద్యా ప్రమాణాల మెరుగుతో పాటు పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది.



ప్రత్యేక తరగతులపై ఫోకస్

మార్చిలో జరిగే పదో తరగతి కామన్ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహించటంతోపాటు చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల వారిగా తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు, విద్యాధికారులు దశల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండల, పాఠశాల స్థాయిల్లో విద్యాధికారులు, ఉపాధ్యాయులతో సమీక్షలు నిర్వహించిన జిల్లా విద్యాశాఖ సిలబస్ రివిజన్ చేసే ప్రక్రియకు కార్యాచరణ ప్రణాళిక రూపాందించారు. అలాగే, ఈ నెల నుంచి జిల్లాలో 108 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆయా బడుల్లో ప్రత్యేక క్లాసులను నిర్వహిస్తోంది.

వెనుకబడిన సబ్జెక్టుల్లో స్పెషల్ క్లాసులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గతంలో పదో తరగతి విద్యార్థుల్లో ఎక్కువగా ఫెయిల్ అయినట్లు భావిస్తున్న గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్టుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వారానికి 12 పిరియడ్స్ భోదిస్తున్న ఉపాధ్యాయులు ఇందులో 4 పిరియడ్స్ గణితం, 5 పిరియడ్స్ సామాన్య శాస్త్రం, 3 పిరియడ్లు సాంఘీక శాస్త్రం, ఆంగ్లం, తెలుగు బోధించే విధంగా కసరత్తు చేస్తోంది.అలాగే, పదో తరగతి విద్యార్థులను వచ్చే ఫిబ్రవరి నుంచి ప్రతి రోజు ఉదయం 4 నుంచి 5 గంటల వ్యవధిలో ఫోన్ల ద్వారా నిద్ర లేపేందుకు ప్రత్యేక తరహాలో ఉపాధ్యాయులను కేటాయించటంతో పాటు వారి పని తీరును పర్యవేక్షించేందుకు జిల్లా విద్యాశాఖ కార్యాచరణ ప్రణాళిక ఖరారుతో ముందుకు సాగుతోంది.



టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



సబ్జెక్టుల వారీగా చదువుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాం. వారికి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. గతంలో తక్కువగా వచ్చిన ప్రైవేట్ స్కూళ్లపై కూడా దృష్టి సారిస్తున్నాం. వంద శాతం విద్యార్థుల ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేకంగా నోట్స్ తయారు చేసి అందజేస్తున్నాం.

– విజయకుమారి,
మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా డీఈఓ

‘ప్రజావాణి’తో పట్టాదారు పాస్ బుక్ వచ్చింది

- సంతోషం వ్యక్తం చేసిన ఏదులాబాద్ గృహిణి రుక్మిణి
- సీఎంకు ధన్యవాదాలు తెలిపిన రుక్మిణి కుటుంబం



పట్టాదారు పాస్‌బుక్‌తో రుక్మిణి

లక్డీకాపూల్ : సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ‘ప్రజావాణి’ కార్యక్రమం వల్ల మేడ్చల్– మల్కాజ్ గిరి జిల్లా ఘట్కేసర్ మండలం ఏదులాబాద్ గ్రామానికి చెందిన కుటుంబానికి 3 నెలల కాలంలోనే భూమి పట్టాదారు పాసు పుస్తకం అందింది. మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి ఏదులాబాద్ గ్రామ వేణుగోపాలచారి, రుక్మిణీ దంపతులు వచ్చి సంతోషాన్ని వ్యక్తం చేశారు. 2021 నుంచి 16 గుంటల విలువైన భూమిపై ధరణి తప్పిదాల వల్ల అధికారులు తమకు పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వకుండా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిప్పుకున్నారని గృహిణి రుక్మిణి ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నామని, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య చూపిన చొరవ కారణంగా కేవలం 3 నెలల కాలంలోనే తమకు భూమి పట్టాదారు పాసు పుస్తకం అందిందని రుక్మిణి ఆనందాన్ని వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డికి, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యకు రుక్మిణి ధన్యవాదాలు తెలిపారు. సమస్యల పరిష్కార కేంద్రం ప్రజావాణి అని, ఇక్కడ సమస్యలు చెప్పుకుంటే పరిష్కారం దొరుకుతుందని రుక్మిణి స్పష్టం చేశారు.

చెకుముకి సంబరాలను విజయవంతం చేయాలి

పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా





పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ విజయకుమారి, అదనపు కలెక్టర్ రాధికా గుప్తా తదితరులు

సాక్షి,సిటీబ్యూరో: చెకుముకి సైన్స్ సంబరాల్లో విద్యార్థులను భాగస్వాములను చేసి విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జన విజ్ఞాన వేదిక చెకుముకి సంబరాలు–2024 పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి మాట్లాడుతూ.. బాల్యదశ నుంచే విద్యార్థుల్లో మూఢ నమ్మకాలను తొలగించి, సైన్స్ పట్ల ఆసక్తి కలిగించడానికి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల స్థాయిలో నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్టులు, విద్యార్థి దశలో ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. జన విజ్ఞాన వేదిక పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ బి.ఎస్.రెడ్డి మాట్లాడుతూ.. నవంబర్ 7న పాఠశాల స్థాయిలో, నవంబర్ 21న మండల స్థాయిలో, నవంబర్ 28న జిల్లాస్థాయిలో, డిసెంబర్ 14,15,16 తేదీలలో ఆదిలాబాద్‌లో రాష్ట్రస్థాయిల్లో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రావు, మేడ్చల్ జిల్లా నాయకులు జెన్నీ, రామ్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జవహర్‌నగర్: విద్యుత్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా శనివారం కార్పొరేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సాంబశివరావు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి 11:30 సాయిబాబా ఫీడర్ పరిధిలో మార్కెట్ రోడ్డు, సిల్వర్‌గల్లీ, ముత్తుస్వామి కాలనీ, మోహన్‌రావు కాలనీ, వెంకటేశ్వర కాలనీ, భక్తబాయి కాలనీ, వీరభద్రకాలనీ, ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ, ఆనంద్‌నగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు శివాజీనగర్ ఫీడర్ పరిధిలో సంతోష్‌నగర్, శివాజీనగర్, సుక్కమ్మకుంట, విఘ్నేశ్వరకాలనీ, వీకే.ఎన్‌క్లేవ్, కళ్యాణ్‌సులోచన గార్డెన్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

రోడ్డు పూర్తి చేయాలని మంత్రికి వినతి

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్ నుంచి కొట్యాల్‌కు వెళ్ళే రోడ్డు పనులను పూర్తి చేయాలని రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని శుక్రవారం లక్ష్మాపూర్ గ్రామస్తుడు మధుకృష్ణ కోరారు. లక్ష్మాపూర్–కొట్యాల్ రోడ్డు గత ప్రభుత్వ హయాంలో మంజూరు కాగా పనులను ప్రారంభించి అర్ధాంతరంగా నిలిపివేశారన్నారు. కాంట్రాక్టర్ అలసత్వం వల్ల చాలా రోజులుగా పనులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి వెంకట్‌రెడ్డికి ఆయన వివరించి వినతి పత్రం అందజేశారు. సంబంధిత శాఖల అధికారుల నుంచి వివరాలు సేకరించి త్వరలో పనులను పూర్తిచేసేల చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని మధుకృష్ణ తెలిపారు.

విద్యార్థుల చదువుకు ఎమ్మెల్యే బాసట

మల్లాపూర్: ఎంబీబీఎస్ విద్యార్థుల చదువుకి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బాసటగా నిలుస్తున్నారు. మల్లాపూర్ డివిజన్‌కు చెందిన సీతాల విజయ్‌కుమార్ కుమార్తె అఖిల ప్రతిమ మెడికల్ కాలేజీ వరంగల్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించింది. నాగలక్ష్మీనగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్ కుమారుడు జీవన్‌కుమార్ వనపర్తి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. వీరిని శుక్రవారం బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చదువుకు అయ్యే ఫీజును ఒక్కొక్కరికి రూ.29 వేల చెక్కును మాజీ మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. మాజీమంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ.. బీఎల్ఆర్ చారిటుబుల్ ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేయూతను అందించడం అభినందనీయమన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ రాంరెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ఎదులాబాద్‌లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, పౌర సరఫరాల సంస్థ డీఎం సుగుణబాయి హాజరై కేంద్రాన్ని ఆరంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన దిగుబడిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఏడీ వెంకట్‌రాంరెడ్డి, డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ వైస్ చైర్మన్ అనంతరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, వెంకటేష్, మహేందర్, ఉదయ్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి బాసిత్, మండల వ్యవసాయ సహాయకుడు జగదీష్, మాజీ సర్పంచ్ యాదగిరి, రైతులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మధుకర్‌రెడ్డి తదితరులు

శామీర్‌పేట్: దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్, ఉద్దమర్రి, కేశవరం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా సహకార అధికారి (డీసీఓ)తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన ధ్యాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని, ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. అంతేకాకుండా ధాన్యాన్ని కాంటా వేసిన 2 రోజుల్లో రైతు ఖాతాల్లో నగదు జమచేస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్, సొసైటీ వైస్‌చైర్మన్ ఐలయ్య, సీఈఓ నర్సింహులు, కార్యదర్శి శోభారాణి, డైరెక్టర్‌లు నర్సింహులు, భిక్షపతి, బాబుసింగ్, ప్రతాప్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.









బస్టాండ్ ఆవరణలో మురికి కూపాలు

బస్టాండ్ ఆవరణ మురుగుమయం

- డ్రైనేజీ సరిగా లేకపోవడంతో కంపుకొడుతున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

మేడ్చల్: మేడ్చల్ బస్టాండ్‌లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో బస్టాండ్ ఆవరణలో మురుగు నీరు, వర్షపు నీరు నిల్వ ఉండి కంపు కొడుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ముందు భాగంలో, వెనుక భాగంలో మురుగు చేరడం తోపాటు వర్షం నీరు చేరి రోజుల తరబడి ఉండటంతో దుర్వాసన వస్తోంది. నీటీకుంటలో దోమలు చేరడంతో ప్రయాణి కులు రోగాల బారిన పడుతున్నారు. జాతీయ రహదారి పై నుంచి వచ్చే నీరు, మురుగు నీరు ఆవరణలో నిల్వ ఉండటంతోపాటు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఆవరణ అంతా కంపుమయంగా మారింది. చిన్న వర్షం కురిసినా, డ్రైనేజీ పొంగిపొర్లినా బస్టాండ్ అపరిశుభ్రంగా మారిపోతోంది. అధికారులు పట్టించుకుని సమస్యను తీర్చాలని ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులు కోరుతున్నారు.

గ్రూపు- 3 పరీక్షకు 118 కేంద్రాలు



సాక్షి,సిటీబ్యూరో: నవంబరు 17, 18 తేదీల్లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించనున్న గ్రూప్–3 పరీక్షకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 118 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని డీఆర్‌ఓ హరిప్రియ తెలిపారు. శుక్రవారం సచివాలయం నుంచి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్– 2,3 పరీక్షలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, సభ్యులు కలెక్టర్లతో నిర్వహించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జిల్లారెవెన్యూ అధికారి హరిప్రియ పలు విషయాలను పేర్కొన్నారు. జిల్లాలో 71,356 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు డీఆర్‌ఓ తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో 7 స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.